
సాక్షి బాపట్ల
శనివారం ׀ 11 ׀ జనవరి ׀ 2025



ముక్కోటి ఏకాదశి పూజలు

దాచేపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం దాచేపల్లిలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో అర్చకులు కొనూరి రవి కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 565.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



తెనాలి రహదారికి మరమ్మతులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి – తెనాలి ఆర్ అండ్ బీ రహదారికి రెండో విడతలో శుక్రవారం మోరంపూడి నుంచి మంగళగిరి బైపాస్ వరకు మరమ్మతులు చేపట్టారు.

న్యూస్‌రీల్

శతాధిక వృద్ధుడి మృతి



యర్రంవారిపాలెం (కారంచేడు): 103 సంవత్సరాల వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన గుదిబండి వెంకారెడ్డి (103) 1921లో జన్మించారు. ఆయనకు కుమారుడు గుదిబండి లక్ష్మారెడ్డి ఉన్నారు. ఇద్దరు మనుమళ్లు, ఒక మనుమరాలు, మునిమళ్లు, మునిమనుమరాళ్లు ఉన్నారు. కొన్ని రోజులుగా అస్వస్థతగా ఉన్న వెంకారెడ్డి మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయనను చూసేందుకు గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చారు. శనివారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకారెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

16న అప్రెంటిస్ మేళా

తెనాలి రూరల్: తెనాలి చినరావూరు ఐటీఐలో ఈ నెల 16న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన జిల్లాలోని అభ్యర్థులు హాజరుకావచ్చని, వివిధ కంపెనీలు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నేరుగా సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయ యోగాలో విజయలక్ష్మికి రజత పతకం



గుంటూరువెస్ట్(క్రీడలు): పుదుచ్చేరీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు నిర్వహించిన 30వ ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివల్‌లో గుంటూరుకు చెందిన గోలి విజయలక్ష్మి రజత పతకం గెలుపొందారు. 45–55 వయస్సు విభాగంలో ఈ పతకం గెలిచినట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ పతకం సాధించిన విజయలక్ష్మికి కుటుంబసభ్యులతోపాటు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.

18 వరకు గడువు పొడిగింపు

గుంటూరుమెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. తొలుత ఈనెల 15 వరకు నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అని ప్రకటించామని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15వరకు వరుసగా ప్రభుత్వ సెలవులు ఉన్నందున 18వ తేదీ వరకు గడువును పొడిగించామని తెలిపారు. ఇప్పటి వరకు 3,530 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మేదరమెట్ల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడుకు చెందిన డీ.నారాయణ (65) పొగాకు బ్యారన్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. బాధితుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలిచగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

బైకును ఢీకొన్న కారు..

మరో ప్రమాదంలో బైకును కారు వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన కొరిశపాడు మండలం వద్ద ఉన్న రన్‌వేపై శుక్రవారం జరిగింది. అలవలపాడు గ్రామానికి చెందిన వజ్జా సుబ్బయ్య (59) పని నిమిత్తం ఒంగోలు వైపు నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో రన్‌వే వద్దకు రాగానే వెనుక నుంచి కారు బైకును ఢీకొంది. తీవ్ర గాయాలైన సుబ్బయ్యను అద్దంకి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ రఫీ తెలిపారు.

యార్డులో 58,485 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 51,445 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 58,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



యద్దనపూడి మండలం పూనూరులో విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి



పర్చూరులో కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అద్దంకిలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

వైభవంగా ముక్కోటి ఏకాదశి

ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు శంఖుతీర్థం అందించారు. పర్చూరులో కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూనూరులో వేణుగోపాలస్వామి విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. –సాక్షి, నెట్‌వర్క్

తప్పుకోకుంటే కేసులే

- రేషన్ డీలర్లకు అధికారుల అల్టిమేటం
- సమావేశాలు పెట్టి హెచ్చరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు
- పర్చూరు, అద్దంకి, రేపల్లె, వేమూరుల్లో ముగిసిన సమావేశాలు
- చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లోనూ ఇదే తీరు
- రాజీనామా చేయకపోతే 6ఏ కేసులు
- ఇప్పటికే కొందరు రాజీనామాలు
- రాజీనామా చేయని పలువురిపై 6–ఏ కేసులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం చినగంజాంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దివ్యాంగుడు పాదుర్తి దేవదానం 2013 నుంచి రేషన్ డీలర్‌గా ఉన్నాడు. వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు అన్న అక్కసుతో జులై నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు షాపుపై దాడులు చేసి 6ఏ కేసులు బుక్ చేసి డీలర్‌షిప్ తొలగించారు. ఆయన స్థానంలో పచ్చ పార్టీ నేత చెప్పిన వారికి డీలర్‌షిప్ కట్టబెట్టారు.

➡ చినగంజాం మెయిన్‌లోని ఆత్మకూరు బ్రహ్మయ్య 12 ఏళ్లుగా రేషన్ డీలర్‌గా ఉన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలోనూ డీలర్‌గా ఉన్న బ్రహ్మయ్యను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తొలగించక కొనసాగించారు. కానీ 15 రోజుల కిందట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య రేషన్ షాపుపై దాడిచేసి 6ఏ కేసు నమోదుచేసి ఆయన డీలర్‌షిప్ తొలగించి వేరొకరికి కేటాయించారు.

➡ ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడంత. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన గడచిన ఏడునెలల కాలంలో బాపట్ల జిల్లాలో వందలాది మంది రేషన్ డీలర్లను తొలగించారు. పచ్చనేతల బెదిరింపులతో కొందరు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి తప్పుకోగా 6ఏ కేసులు పెట్టి వేధించడంతో మరికొందరు డీలర్ షిప్పులు వదులుకున్నారు. తాజాగా పచ్చనేతలు పట్టుబట్టడంతో మిగిలిన వారిని తొలగించేందుకు పౌరసరఫరాల అధికారులు సిద్ధమయ్యారు. ఉన్నతాధికారి ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు డీలర్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేశారు.

➡ చీరాల నియోజకవర్గంలో పౌరసరఫరాల విభాగానికి చెందిన ఓ అధికారి ఈ విషయంలో మరింత ముందున్నారు. రెండు వారాల కిందట వేటపాలెం మండలంలోని ఒక కల్యాణ మండపంలో రేషన్ డీలర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నాటికి రాజీనామాలు చేయాలని, లేకుంటే కేసులు తప్పవని బెదిరింపులకు దిగినట్లు సమాచారం. చీరాల రూరల్, అర్బన్ మండలాల్లోని రేషన్ డీలర్లతో ఆ అధికారి ప్రైవేటు సమావేశం నిర్వహించారు. 99 మంది రేషన్ డీలర్లు ఉండగా, 70 మంది డీలర్లను మాత్రమే తక్షణం రాజీనామాలు చేయాలని అల్టిమేటం ఇచ్చారు. పై నుంచి ఒత్తిళ్లు ఉన్నందున తక్షణం రాజీనామాలు చేసి సహకరించాలని కోరినట్లు పలువురు డీలర్లు తెలిపారు.

➡ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ విషయంలో అందరికంటే ముందున్నారు. ఆయన అనుచరులు ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో పాత డీలర్లందరినీ తొలగించారు. ఒకరిద్దరు బెట్టు చేసినా కేసులకు భయపడి వెనక్కి తగ్గారు. బాపట్ల నియోజకవర్గంలో దాదాపుగా డీలర్‌షిప్పులను పచ్చపార్టీ వారికి కేటాయించారు. మిగిలివున్న వాటిని ఈ నెలాఖరుకు ఖాళీచేయించే పనిలో పడ్డారు.

➡ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గంలోని చెరుకుపల్లి, నగరం మండలాల్లో ఇప్పటికే పలువురు డీలర్లను తొలగించి వారి స్థానంలో పచ్చపార్టీ కార్యకర్తలను నియమించారు. రాజీనామాలు చేసేందుకు ఇష్టపడని డీలర్లపై 6ఏ కేసులు పెట్టారు. చెరుకుపల్లి మండలంలో ఆరుగురిపైన, నగరం మండలంలో 18 మందిపై 6ఏ కేసులు పెట్టడం గమనార్హం. మిగిలిన మండలాల్లోనూ పలువురు పాత డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశారు. మిగిలిన పాత డీలర్లందరూ ఈ నెల చివరాఖరుకు రాజీనామాలు చేయాల్సిందేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు అల్టిమేటం ఇచ్చారు.

➡ వేమూరు నియోజకవర్గంలోనూ ఇప్పటికే పలువురు పాత డీలర్లు రాజీనామా చేయగా మరికొంత మందిపై 6ఏ కేసులు నమోదు చేయించి తొలగించారు. మిగిలిన వారిని జనవరి చివరినాటికి తొలగించే పనిలో పడ్డారు. ఇప్పటికే పచ్చనేతల ఆదేశాలు అందుకున్న పౌరసరఫరాల అదికారులు పాత డీలర్ల తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. గత ప్రభుత్వం దశాబ్దాలుగా ఉన్న చాలామంది డీలర్లను తమ హయాంలోనూ కొనసాగించగా కూటమి ప్రభుత్వం గతంలో ఉన్న వారందరినీ తొలగించడంపై డీలర్లు మండిపడుతున్నారు.

విజయవాడ–గూడూరు మార్గంలో నాల్గవ లైన్ మంజూరు

ఎంపీ తెన్నేటి

బాపట్ల: విజయవాడ నుంచి గూడూరు వరకు నాల్గవ రైల్వే లైన్ మంజూరు అయ్యిందని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, హోమ్ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లో దిశ(జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం) చైర్మన్, పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి కేంద్రం మంజూరు చేసిన పలు ప్రాజెక్టులను వివరించారు. రేపల్లె నుంచి బాపట్ల వరకు కొత్తగా రైల్వేలైన్ మంజూరు చేస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రైల్వే మూడో లైన నిర్మాణం జరుగుతుండగా నాల్గవ రైల్వే లైన్ నిర్మించాలని నాలుగు సార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి విన్నవించగా మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా జిల్లాల ప్రజల ప్రయాణ ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. నాల్గవ రైల్వే లైన్ నిర్మాణంతో బహుళ ప్రయోజనం ఉంటుందన్నారు. తెనాలి–రేపల్లె రైల్వే మార్గంలో రెండో లైన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారన్నారు. వేమూరు నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు డెల్టా ఎక్స్‌ప్రెస్ నిలపడానికి అనుమతులు లభించాయని తెలిపారు. గుంటూరు–నిజాంపట్నం వరకు నాలుగు రహదారుల గ్రీన్ ఫీల్డ్ మంజూరైందని తెలిపారు. మచిలీపట్నం నుంచి ఒంగోలు వరకు ఉన్న 216 జాతీయ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరింప చేయడానికి కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

పేదరిక నిర్మూలన లక్ష్యంతో ముందుకుపోదాం

పేదరిక నిర్మూలన లక్ష్యంతో దారిద్ర్యరేఖ దిగువన ఉండే కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా అధికారులు కృషి చేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో దిశ(జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం) చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు కృష్ణప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారా అమలవుతున్న 44 పథకాలపై ఆయన చర్చించారు. స్వర్ణాంధ్రప్రదేశ్–2047 డాక్యుమెంటరీని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళితో కలిసి విడుదల చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, ప్రకాశం జిల్లా జెడ్పీ సీఈవో చిరంజీవి, గుంటూరు జెడ్పీ సీఈవో జ్యోతిబసు, రేపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జాతీయస్థాయి ఎడ్ల పందేలు

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జాతీయస్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పర్చూరు మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో శుక్రవారం ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో నిర్వహించిన పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. 9 క్వింటాళ్ల బండను 15 నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం లాగిన జతను విజేతగా ప్రకటిస్తారని వివరించారు. శుక్రవారం 4 పళ్ల విభాగంలో జరిగే పోటీలో 10 ఎడ్ల జతలు పాల్గొంటాయని తెలిపారు. గెలుపొందిన ఎడ్ల జతకు ప్రతి విభాగంలో 9 బహుమతులుంటాయని తెలిపారు. చివరి సమాచారం అందే సమయానికి పల్నాడు జిల్లా చాగంటి శ్రీనివాసరావుకు చెందిన ఎడ్ల జత 15 నిమిషాల వ్యవధిలో 9 క్వింటాళ్ల బండను 4,034 అడుగుల దూరం లాగి ముందంజలో ఉన్నాయి. వ్యాఖ్యాతలుగా రాయంకి వేమారెడ్డి, గూడ శ్రీనివాసరావు, అంపైర్‌గా పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించారు.



అన్నంబొట్లవారిపాలెంలో ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ప్రాంగణాన్ని పరిశీలించిన డీఎస్పీ..

ఎడ్ల పందేలు జరుగుతున్న ప్రాంగణాన్ని బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు పరిశీలించారు. ఎడ్ల పందేలు తిలకించడానికి ఎక్కువ సంఖ్యలో రైతులు, ప్రజలు రానున్న దృష్ట్యా అక్కడి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రాంగణంలో తొక్కిసలాట చోటుచేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ మాల్యాద్రిని ఆదేశించారు. బందోబస్తు ఏర్పాటుచేశారు.

మళ్లిన నిధులు..పస్తుల్లో కార్మికులు

- ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు
- పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు
- నిధులు లేవంటూ చేతులెత్తేసిన చిన్న పంచాయతీలు
- కార్మికులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలకు, నిరసనలకు దిగుతున్న కార్మికులు



ఇంకొల్లులో పేరుకుపోయిన చెత్త

చినగంజాం: కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాల్లోకి మళ్లించుకుంది. దీంతో జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు, క్లాప్‌మిత్రలకు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు కోట్లలోనే ఉంటుందని సీఐటీయూ నాయకులు చెప్తున్నారు. దాంతో కార్మికులు ఆందోళనలకు, నిరసనలకు దిగుతున్నారు.

గత ప్రభుత్వంలో వైభవం..

గత ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో పంచాయతీలలో పరిశుభ్రత, ప్రజారోగ్యం కోసం క్లాప్ మిత్రలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్యం మెరుగుపరచడం కోసం కృషి చేస్తున్న క్లాప్ మిత్రల పరిస్థితి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దయనీయంగా మారింది. జిల్లాలో మొత్తం 461 పంచాయతీలలో 400కి పైగా మంది రెగ్యులర్, కాంట్రాక్టు, రోజువారీ కార్మికులు, 1650 మంది క్లాప్ మిత్రలు పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆయా గ్రామ పంచాయతీలలో కార్మికులను ఏర్పాటు చేసి కార్మికులకు రెగ్యులర్‌గా ప్రతి నెలా జీతాలు చెల్లించే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ కార్మికులకు అందజేసే వేతనంలో రూ.6 వేలు కేంద్రం నిధులు కాగా, మరో రూ.4 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. పంచాయతీకి వచ్చే సాధారణ నిధుల నుంచి ముందుగా ఆయా పంచాయతీలలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించిన తరువాత మిగిలిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ పక్షంలో ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు చెల్లించి నిధులు సమకూరిన తరువాత జమ చేసుకోవాల్సి ఉండగా పంచాయతీల్లో అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. నిధులు అందుబాటులో ఉన్న పంచాయతీల్లో వేతన బకాయిలు చెల్లించినప్పటికీ జిల్లాలో అత్యధిక పంచాయతీలలో ఆరు నెలల నుంచి 10 నెలలకు పైగా బకాయిలు ఉన్నట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది.

పేరుకుపోయిన వేతన బకాయిలు

జిల్లాలోని పర్చూరు నియోజకవర్గ పరిధిలో చినగంజాం, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల్లో పెద్ద పంచాయతీలలో 3 నుంచి 6 నెలలు, చిన్న పంచాయతీల్లో 10 నెలలు పైగా కార్మికులకు వేతన బకాయిలున్నాయి. దాంతో పంచాయతీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామాలలో ఎక్కడి చెత్త అక్కడే...

నెలల తరబడి వేతనాలు రాకపోతుండటంతో మొక్కుబడి పనులు నిర్వహిస్తూ మిగిలిన సమయాలలో పొట్ట నింపుకునేందుకు వేరే పనులకు వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకొని పోతుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నాం..



మూడు నెలలుగా జీతాలు లేవు. బాగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబం గడుపుకునేందుకు వేరే పనులకు వెళ్తున్నాం.

ఏసురాజు, కొత్తపాలెం పంచాయతీ, చినగంజాం మండలం.

పస్తులతో ఉండాల్సి వస్తుంది..



మాకు జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవటం లేదు. ఇంటిల్లిపాదీ పస్తులుంటున్నాం. పొట్ట నింపుకునేందుకు వేరే పనులకు వెళుతున్నాం. పంచాయతీలో సక్రమంగా జీతం ఇస్తే ఇక్కడే ఉంటాం. కానీ మమ్మల్ని అధికారులు పట్టించుకోవడం లేదు.

– సుబ్రహ్మణ్యం, చినగంజాం

విధులకు వెళ్తూ విగతజీవుడై..

- రోడ్డు ప్రమాదంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్సై దుర్మరణం
- ప్రమాదానికి కారణం దొనకొండ ఎస్సై కారు

చీరాల టౌన్: పండుగ రోజుల్లో ఆ కుటుంబంలో విషాదం నిండింది. తెల్లవారుజామున మంచు కురుస్తున్నా తన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు విధులకు బయలుదేరిన ఓ ఏఎస్సై శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బాపట్ల జిల్లా చీరాల ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు, స్నేహంగా మెలిగే ఏఆర్ ఏఎస్‌ఐ మేడిద సంపూర్ణరావు (58) అసంపూర్తిగానే జీవితాన్ని ముగించారు. ప్రమాదానికి కారణమైన కారు ప్రకాశం జిల్లా దొనకొండ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న కొక్కిలిగడ్డ విజయ్‌కుమార్‌ది కావడం గమనార్హం.

కలివిడిగా ఉండే సంపూర్ణరావు..

పోలీసు వృత్తితోపాటు కుటుంబ బాధ్యతలను, స్నేహితులను ఆప్యాయం పలుకరించే సంపూర్ణరావు అర్ధాంతరంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడు సంపూర్ణరావుకు భార్య పద్మ, కుమారుడు పృథ్వీరాజ్, కుమార్తె మౌనిక ఉన్నారు. 1991లో పోలీసు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన సంపూర్ణరావు ఏడాది కిందట ఏఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు.



మృతిచెందిన ఏఆర్ ఏఎస్సై సంపూర్ణరావు

మిన్నంటిన రోదనలు..

ఏఎస్సై సంపూర్ణరావు మృతితో ఏరియా హాస్పిటల్ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. మృతుడి భార్య పద్మ, కుమార్తె, కుమారుడుని ఓదార్చడం ఎవరీ వల్లా కాలేదు. ఏరియా వైదశాల మార్చురీ ప్రాంగణం అంతా పోలీసులు, కుటుంబ సభ్యులతో నిండిపోయింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఎస్సై విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.



ఏరియా హాస్పిటల్ వద్ద రోదిస్తున్న మృతుడి భార్య, కుటుంబ సభ్యులు

నేడు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు..

ఏఆర్ ఏఎస్సై మేడిద సంపూర్ణరావు అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో శనివారం నిర్వహించనున్నారు. సంపూర్ణరావు కుటుంబ సభ్యులను చీరాల డీఎస్పీ మోయిన్, ఏఆర్ డీఎస్పీ, ఆర్ఐలు, ఏఆర్ ఎస్సైలు, పోలీసు ఉద్యోగుల సంఘం నాయకులు పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

క్లుప్తంగా

ఘనంగా మంత్రి అనగాని జన్మదిన వేడుకలు



రేపల్లె రూరల్: రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జన్మదిన వేడుకలను పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనగాని జన్మదిన కేక్‌ను కట్ చేసి తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తన్నేటి కృష్ణప్రసాద్, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య, ఏలూరు సాంబశివరావు తదితరులు అనగానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు అనగానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, దండుప్రోలు పిచ్చియ్య, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పంతాని మురళీధరరావు, తదితరులు పాల్గొన్నారు.

సైనేడ్ హత్య కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

తెనాలి రూరల్: ఇటీవల సంచలనం సృష్టించిన వరుస సైనేడ్ హత్య కేసుల్లో నిందితులైన తల్లీకూతుళ్లను పోలీసులు శుక్రవారం మరోసారి అరెస్ట్ చేశారు. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, ఆమె తల్లి రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేశారు. ఇటీవల అరెస్టు అయి రిమాండ్‌లో ఉండి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. సైనేడ్ హత్యలు వెలుగులోకి రావడంతో ఇదే కాలనీకి చెందిన కవెవరపు మోషే అలియాస్ పీసు మృతిపై అనుమానం ఉందంటూ అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్టోబర్ 4న కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో మోషేని ఖననం చేసిన ప్రాంతంలో శవాన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఇందులో సైనేడ్ వల్ల మృతి చెందినట్టు పోలీసులకు ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చింది. తల్లీ కూతుళ్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

పల్లెటూరి అబ్బాయే క్రికెట్ కోచ్

- క్రికెట్ ఆటగాడిగా పేరు ప్రఖ్యాతులతో కోచ్‌గా రాణింపు
- జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడి ఆరు బంగారు పతకాలు
- అండర్–23 భారత్ క్రికెట్‌లో ప్రతిభతో గోల్డ్ మెడల్
- సత్తా ఉన్నా జాతీయ స్థాయిలో ఆడటానికి పేదరికం అడ్డు



ఆగ్రాలో ఆడిన టీమ్‌కు కోచ్‌గా.. (ఇన్‌సెట్) కప్పుతో సుధాకర్

అద్దంకి: పెద్దపెద్ద క్రీడాకారులు ఎక్కడ నుంచో రారు. పేరు ప్రఖ్యాతులు సంపాదించిన క్రీడాకారుల్లో ఎక్కువ మంది పల్లెటూళ్ల నుంచి వచ్చిన వారే అధికం. అదే కోవకు చెందిన వాడు బాపట్ల జిల్లా అద్దంకి మండలం విప్పర్లవారిపాలెం అనే చిన్న గ్రామం నుంచి క్రికెట్ కోచ్‌గా ఎదిగిన అల్లడి సుధాకర్. సుధాకర్ చిన్న వయసు నుంచే క్రికెట్ ఆటపై మక్కువ పెంచుకున్నాడు. ఇతర ప్రాంతాల్లో జరిగే మ్యాచ్‌ల్లో ఆడి మంచి గుర్తింపు పొందాడు. ఇంటరు చదివే సమయంలో అండర్–19 జట్టుకు 2017లో ఎంపికై జిల్లా స్థాయిలో ప్రతిభ చూపడమే కాకుండా ఆల్ రౌండర్‌గా నిలిచి జట్టు విజయానికి బాటలు వేశాడు. దాంతో అండర్–23కు 2023లో జట్టుకు భారత్ జట్టులో స్థానం సంపాదించాడు. అక్కడా ప్రతిభ చూపి మీడియం ఫాస్ట్ బౌలర్‌గా ప్రత్యర్థి జట్టులోని వికెట్లు తీసి జట్టు విజయానికి తోడ్పాటు నిచ్చాడు. జట్టుకు ప్రథమ స్థానం రావడంతోపాటు వ్యక్తిగతంగా బంగారు పతకం లభించింది. 2019లో ఏషియయన్ గేమ్స్‌కు నేపాల్‌లోని ఖాట్మండులో బాగా ఆడాడు. బోర్డ్ ఆఫ్ ఇండియా తరఫున కొలంబోలో మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

మూడు అసోసియేషన్ల తరుపున కోచ్‌గా..

ఒక వైపు క్రికెట్‌లో సత్తా చాటుతూనే మరో వైపు ఎంబీఏ పూర్తి చేశాడు. క్రికెట్‌పై ఉన్న మక్కువను వదిలేయలేక, ప్రస్తుతం టాప్ పది స్థానాల్లో నిలిచిన అసోసియేషన్లలో మూడు అసోసియేషన్లలో క్రికెట్ కోచ్‌గా రాణిస్తూ తన లాంటి ఔత్సాహిక క్రీడాకారులకు ఆట నేర్పుతూ సంతృప్తి చెందుతున్నాడు. అయితే తనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండి ఉంటే తప్పని సరిగా జాతీయస్థాయి జట్టుకు ఎంపికై దేశానికి తన వంతు కృషి చేసేవాడినని చెబుతున్నాడు అల్లడి సుధాకర్. ఆసక్తితోనే కోచ్‌గా క్రికెట్ మీద ఉన్న మమకారం తనకు వచ్చిన ఆటను మరికొందరికి నేర్పుతూ వారు ఎదిగితే తాను ఎదిగినట్లు భావిస్తానని సుధాకర్ చెప్తున్నాడు. అందుకే నైన్ ఏ క్రికెట్ అసోసియేషన్‌కు కోచ్‌గా, మంచి క్రీడాకారులను తయారు చేసే పనిచేస్తున్నానని చెప్తున్నాడు.

సెమీస్‌కు చేరిన గుంటూరు, చెన్నై జట్లు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



తలపడుతున్న గుంటూరు, చెన్నై జట్లు

మేదరమెట్ల: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతలలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2025 పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన పోటీల్లో జీడీసీఏ లెవెన్ (గుంటూరు), ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై) జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

- ఉదయం మస్తాన్ లెవెన్ (మార్టూరు), జీడీసీఏ లెవెన్ (గుంటూరు) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన మార్టూరు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 116 పరుగులు మాత్రమే చేసింది. జీడీసీఏ లెవెన్ బౌలర్ కే.మహీప్‌కుమార్ నాలుగు ఓవర్లు వేసి 9 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు తీశాడు. మార్టూరు జట్టులో ఎవరూ చెప్పుకోదగిన పరుగులు చేయలేదు. అనంతరం 117 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు 18.2 ఓవర్లలో విజయలక్ష్యాన్ని చేరుకుంది. ఈ జట్టులో కే.మహీప్‌కుమార్ 47 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 53 పరుగులు చేసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచాడు. ఒక వికెట్ తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌లో చోటు సంపాదించుకుంది.
- మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ ఎంఆర్‌సీసీ లెవెన్ (చెన్నై), మిస్ రాకీ లెవెన్ చెన్నై జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎంఆర్‌సీసీ జట్టు బ్యాటింగ్ ఎంచుకొంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. ఈ జట్టులో సుధాన్ సంజీవి 39 బంతుల్లో 4 ఫోర్లు ఒక సిక్స్ సాయంతో 40 పరుగులు చేశాడు. మిస్ రాకీ లెవెన్ బౌలర్ రాకేష్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 33 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. 155 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన మిస్‌రాకీ లెవెన్ చెన్నై జట్టు 14.1 ఓవర్లలో 72 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఎంఆర్‌సీసీ లెవెన్ బౌలర్ నిరాంకర్ శర్మ 2 ఓవర్లు వేసి 7 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. దీంతో 82 పరుగుల భారీ తేడాతో ఎంఆర్‌సీసీ లెవెన్ చెన్నై జట్టు గెలుపొంది సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది.



గుంటూరు ఆటగాడు మహీప్‌కుమార్

నేటి మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం మ్యాచ్ ఇండియన్ బ్యాంక్ ఎస్అండ్ఆర్‌సీ (చెన్నై)–తండర్ బోల్ట్స్ లెవెన్ (తిరుపతి) జట్ల మధ్య జరగనుంది. మధ్యాహ్నం మ్యాచ్ ఎస్సీ రైల్వేస్ (విజయవాడ), ఎస్‌కేఎం సీసీ లెవెన్ (చెన్నై) జట్ల మధ్య జరుగనుంది.

ఎస్‌ఐని అరెస్టు చేసి న్యాయం చేయండి

మృతుడి బంధువులు, దళిత సంఘాల ఆందోళన



వాడరేవు రోడ్డులో ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు, మృతుని బంధువులు

చీరాల టౌన్: విధి నిర్వహణకు వెళ్తున్న ఏఆర్ ఏఎస్సై మేడిద సంపూర్ణరావు మృతికి కారణమైన దొనకొండ ఎస్ఐ కొక్కిలిగడ్డ విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతుని కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంపూర్ణరావు మృతికి కారణమైన ఎస్సై విజయ్‌కుమార్ పేరును ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చకుండా పోలీసులు వ్యవహరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి వాడరేవు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డుపై దళిత సంఘాలు, మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. రోడ్డు నుంచి వాహనాలు వెళ్లకుండా దుంగలు, రాళ్లు అడ్డుపెట్టి నినాదాలు, ఆందోళన చేపట్టారు. దళిత సంఘాల నాయకులు కంచర్ల చిట్టిబాబు, మాచవరపు జూలియన్, గోసాల సుధాకర్, మల్లెల బుల్లిబాబు తదితరులు మాట్లాడుతూ.. ఏఆర్ ఎస్సై సంపూర్ణరావు మృతికి కారణమైన ఎస్ఐ పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేయడం దారుణమన్నారు. అంతకు ముందు ఎస్ఐ విజయ్ కుమార్ పలు వివాదాల్లో చిక్కుకున్నాడని తెలిపారు. చీరాలలో మాస్క్ పెట్టుకోలేదని దళిత యువకుడిని మరణించేలా టార్చర్ చేసిన ఎస్ఐ విజయ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించేంత వరకు ఉద్యమాన్ని ఆపమన్నారు. సమాచారం అందుకున్న చీరాల వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, నాగభూషణం, శేషగిరిరావులు ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడినా వారు ఆందోళన విరమించలేదు. చివరకు ఇన్‌చార్జి తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సమక్షంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు, బంధువుల డిమాండ్ ఎస్ఐను అరెస్టు చేసి రిమాండ్‌కు శనివారం పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళన గంటన్నరపాటు జరగడంతో వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, దళితులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల అవినీతిపై ఆర్డీవో విచారణ

- లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన బాధితురాలు
- అధికారులు, సిబ్బంది తీరుపై ఆర్డీవో తీవ్ర ఆగ్రహం



విచారణ చేస్తున్న ఆర్డీవో మధులత

శావల్యాపురం: రెవెన్యూ కార్యాలయం అవినీతిమయంగా మారిందని వరుస ఫిర్యాదులు రావడంతో కలెక్టరు ఆదేశాల మేరకు నరసరావుపేట ఆర్డీవో కె.మధులత శుక్రవారం విచారణ చేపట్టారు. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి ఒక్కో రేటును రెవెన్యూ అధికారులు నిర్ణయించారని, ధరల పట్టికను సైతం సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నాయకులు పోస్ట్ చేశారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇవేమీ అమలు కావటం లేదు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీవో మధులత విచారణ చేపట్టారు. మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ముంద్రు పేరమ్మ ఫ్యామిలీ ధ్రువీకరణ పత్రం కోసం మీసేవా సెంటరు నిర్వహించే గట్టుపల్లి మహేష్‌ను సంప్రదించారు. రూ. 2500 ఖర్చు అవుతుందని, ఇందులో రెవెన్యూ అధికారులకు వాటా ఇవ్వాలని చెప్పాడు. దీంతో అర్జీకి సంబంధించిన రుసుం మాత్రమే చెల్లించి తదుపరి తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ కూడా లంచం అడగ్గా గత్యంతరం లేని పరిస్థితుల్లో తహసీల్దారు కారు డ్రైవరుకు రూ. 1000 ఇచ్చారు. ఆ తర్వాతే ధ్రువీకరణ పత్రం తీసుకున్నట్లు ఆర్డీవో మధులతకు పేరమ్మ లిఖితపూర్వకంగా తెలిపారు.

ఒకే భూమి ఇద్దరికి విక్రయం

మండలంలోని పిచికలపాలెం గ్రామంలో సర్వే నంబరు 324లో తుర్లపాటి సీతయ్యకు చెందిన సాగు భూమిని అదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు ఎకరం 45 సెంట్లు కొన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల ప్రమేయంతో నకిలీ పత్రాలు సృష్టించి ఇదే భూమిని చేబ్రోలు శిరీషకు కూడా సీతయ్య విక్రయించాడు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి రిపోర్టు ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. సీతయ్యపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో విలేకర్ల సమావేశంలో తెలిపారు.

సమయ పాలన పాటించాలి

తహసీల్దారు కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోవడంపైనా ఆర్డీవో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తహసీల్దారు కె.సుజాత మధ్యాహ్నం 12.30 నిమిషాలకు కార్యాలయానికి రావటంపై ప్రశ్నించారు. సాకులు చెప్పవద్దని, ఎన్ని పనులున్నా సమయానికి ఆఫీసుకు రావాలని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, మండల రైతు సంఘం నాయకులు కె.వి.ఆర్.మోహన్‌చందు ఇక్కడి అధికారుల తీరుపై ఆర్డీవోకు వివరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు తిరస్కరించిన అర్జీల రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు కె.సుజాత, డిప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పేరిసోముల నాసరయ్య, సీనియర్ సహాయకులు చంద్రబాబు, వీఆర్వో నరసింగరావులు ఆర్డీఓ వెంట ఉన్నారు.

ఉత్సవమేదైనా ఖాకీలదే అత్యుత్సాహం !

- దర్శన వ్యవస్థ మొత్తం వారి ఆధీనంలోనే..
- సామాన్య భక్తులకు చుక్కలు
- దేవస్థాన సిబ్బందితోనూ వాగ్వివాదం



మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద సామాన్య భక్తులతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉత్సవం ఏదైనా ఆ సమయంలో భక్తులు ఎంతమంది వస్తారు? వారికి దర్శనం ఎలా కల్పించాలనే? అంశంపై దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉంటుంది. సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులకు దర్శనం కల్పించడంపై వారంతా ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. రద్దీని నియంత్రించేందుకు, క్యూలైన్లు సక్రమంగా సాగేందుకు, తొక్కిసలాట వంటివి జరగకుండా పోలీసుల సహాయం తీసుకుంటారు. రెండు విభాగాల సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా పర్యవేక్షణను పోలీసులు తమ చేతుల్లోకి తీసుకుని, దేవదాయ శాఖ అధికారుల సూచనలను పక్కన పెట్టడం విమర్శలకు తావు ఇస్తోంది.

పోలీసుల తీరుపై విమర్శలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారుల వైఫల్యం, పోలీసుల తీరు భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. తమకు తెలుసుకు వారిని, బంధువులను నిబంధనలకు విరుద్ధంగా పెద్ద సంఖ్యలో ప్రోటోకాల్, వీఐపీ ద్వారా దర్శనానికి పంపి పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నా ఉపయోగం లేదంటూ వాపోతున్నారు. భక్తులు గతంలో ఎన్నడూ లేనంతా ఈసారి ఇబ్బందులు ఎదుర్కోవడానికి అధికారుల నిర్ణయాలతో పాటు పోలీసుల తీరు ఒక కారణమని విమర్శలు ఉన్నాయి. స్థానిక పోలీస్ అధికారుల కంటే బయట నుండి వచ్చిన పోలీసులే హడావుడి చేయడంలో డిపార్ట్‌మెంట్‌లోనే గుసగుసలు వినబడుతున్నాయి.

ఈవోతోనూ వాగ్వివాదం

ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న వీఐపీ గేటు వద్ద బయట నుంచి ఓ అధికారి భక్తులపై రుసరుసలాడడంతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, కార్యనిర్వహణాధికారిపై సైతం వాగ్వివాదానికి దిగడం చర్చనీయాంశమైంది. సమయపాలన లేకుండా వీఐపీల కోసం ఎప్పుడు పడితే అప్పుడు సామాన్య భక్తుల క్యూలైన్లను నిలిపివేసి ఇబ్బంది కలిగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడుతూ నరకం అనుభవించారు.

‘ఒక జిల్లా ఒక ఉత్పత్తి’పై కేంద్ర బృందం అధ్యయనం

- గుంటూరు మిర్చి యార్డు సందర్శన
- అధికారుల నుంచి వివరాల సేకరణ



మిర్చి యార్డులో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్య, స్వప్నిల్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ‘ఒక జిల్లా ఒక ఉత్పత్తి’లో భాగంగా గుంటూరు జిల్లా మిర్చి పంటపై ఢిల్లీ పీఎంఓ ఆఫీసులో ఓడీఓఎఫ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్యలు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, జిల్లా రైతులు పండించిన కొన్ని మిరప రకాలను వీక్షించారు. ఓడీఓపీ డాక్యుమెంటేషన్‌పై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అధ్యక్షత వహించారు. ఆ తర్వాత డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, లాఫారంను సందర్శించారు. మిరప రకాలు, చేపడుతున్న ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. లాం ఆర్ఎస్‌కేని సందర్శించి, డిజిటల్ గ్రీన్ వారు రైతులకు అందిస్తున్న సేవల గురించి వాకబు చేశారు. అంకిరెడ్డిపాలెంలో ఉద్యాన శాఖ ద్వారా రాయితీ పొందిన విశ్వసాయి ఫుడ్స్ అండ్ కోల్డ్‌స్టోరేజీని సందర్శించారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది ? రైతులకు ఏ విధంగా స్టోరేజీలు ఉపయోగపడుతున్నాయో ? విపులంగా తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు మిర్చి యార్డు, చుట్టుగుంటలోని స్పైసెస్ బోర్డు కార్యాలయంను సందర్శించి, వారు చేపడుతున్న ప్రాజెక్ట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. మిర్చి యార్డులో విస్తృతంగా పర్యటించారు. సాగులో ఉన్న మిర్చి రకాలు, ధరలు, సీజన్ వ్యవధి, రోజుకు వస్తున్న బస్తాలు, ఏఏ జిల్లాల నుంచి గుంటూరు యార్డుకు మిర్చి వస్తుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పైసెస్ బోర్డు కార్యాలయంలోని మిరప టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. మిర్చి పండించే రైతులు, మిర్చి ఎగుమతిదారులకు ల్యాబ్ వల్ల కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, డాక్టర్ రమణ, శారద పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరుబాట

- ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ముట్టడి
- భైఠాయించి నినాదాలు

లక్ష్మీపురం: అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఏడాది పైగా అయినా ఇంతవరకు పోస్టులు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.రేఖ అన్నారు. నాలుగు రోజులుగా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరాహారదీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు భైఠాయించి నినాదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఖాళీ అయిన పోస్టులను గుర్తించి ఇంటర్వ్యూలు నిర్వహించి, పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా అధికారులు మాత్రం జిల్లాలో నూట పది పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయట్లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సక్రమంగా పనిచేయకపోతుంటే, వాటిని మార్చడానికి బదులు మెమోలు ఇచ్చి వేధించటం సరికాదని తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హామీలు నెరవేర్చేలా జీవోలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న శిలార్ మసూద్

నరసరావుపేట: గతంలో సమ్మె సందర్భంగా అప్పటి సర్కారు ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్ మసూద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట చేపట్టిన రిలే దీక్షలలో భాగంగా స్థానిక మున్సిపల్ ఆఫీసు ఎదుట శిబిరాన్ని జిల్లా కోశాధికారి డి.శివకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మసూద్ మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధనకోసం మున్సిపల్ కార్మికులు గత ప్రభుత్వంలో 17రోజుల పాటు సమ్మె చేస్తే అప్పటి అధికారులతో యూనియన్‌కు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ మేరకు ప్రస్తుత జీవోలు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో కార్మికులు కొద్ది జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. తాము చేసే డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. ఈ ప్రభుత్వంలో చలనం లేదని, ఒకసారి గుర్తు చేయాలని రిలేదీక్షలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చలించకపోతే సమ్మె చేయటానికైనా సిద్ధమేనని తెలిపారు. రాజకీయ వేధింపులు అధికమయ్యాయని, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. సోమశేఖర్, ధూపం నాగభూషణం, షేక్ గౌస్‌బాషా, పిల్లి రమేష్, సత్తెనపల్లి నాగేశ్వరరావు, శివరాత్రి కోటేశ్వరరావు, షేక్ ఖాసిం, సయ్యద్ కరీం, షేక్ ఖాదర్, ఇంద్రయ్య, గూడ సామ్రాజ్యం, రమణ, షేక్ షైలు, కె.సమాధానం, ఏసుపోగు మల్లేశ్వరి దీక్షలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ చిన్న అల్లా బక్షు, కార్మికులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తితో శిక్షకులు, న్యాయమూర్తులు

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలో గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై గుంటూరు, ప్రకాశం, పీఎస్ నెల్లూరు జిల్లాలో ఎంపిక చేసిన న్యాయమూర్తులకు నిర్వహిస్తోన్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్య పరిష్కారంలో వారే కీలక పాత్రదారులని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఉంటుందని, అనుకూలమైన రీతిలో కేసుల్ని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. రాజీపడితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తారని ఆయన తెలిపారు. అగ్రిమెంట్ రాసుకుని రాజీ అయితే జడ్జిమెంట్ కూడా అలాగే వస్తోందని చెప్పారు. నలభై గంటల శిక్షణను న్యాయమూర్తులు విజయవంతం చేశారని ప్రశంసించారు. ఐదు రోజులు న్యాయమూర్తులకు తర్ఫీదు ఇచ్చిన రాజస్తాన్, కేరళ రాష్ట్రాలకు చెందిన ఆచార్య అడ్వకేట్ ప్రమీల, అడ్వకేట్ వి.పి.తంకచన్‌లను సత్కరించారు.